# గ్యాస్ పొయ్యిపై యుద్ధం మంటలు



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట



## పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధికి కృషిచేస్తా

### హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మంత్రి పొన్నం



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్‌ను నూతన పాలక వర్గం సద్వినియోగం చేసుకుని పార్టీలకు అతీతంగా పట్టణంను అభివృద్ధి చేసుకుందామని తెలంగాణ బిసి రవాణ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ నూతన పాలక వర్గానికి అధికారులకు సూచించారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. 2026–2027 సంవత్సరానికి గాను మున్సిపల్ వార్షిక బడ్జెట్ 21 కోట్ల 88లక్షల రూపాయల అంచనా రాబడి 21కోట్ల 88లక్షల అంచనా వ్యయంతో మున్సిపల్ కౌన్సిల్లో ప్రవేశపెట్టగా పాలక వర్గం చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూమున్సిపల్ పరిధిలో వివిధ రకాల నుండి వచ్చే పన్నుల ద్వారా ఆదాయం సద్వినియోగం చేసుకుని పట్టణ అభివృద్ధికి పాలక వర్గం , అధికారులు సమన్వయంతో పని చేస్తు ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తూ పట్టణ ప్రజలు గౌరవం పెరిగేలా పని చేయాలని కోరారు. పట్టణ అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ నిధులు పార్లమెంటు సభ్యులతో కలిసి తెచ్చి పట్టణం మరింత అభివృద్ధికి పాటుపడుదామని అన్నారు.

**పట్టణ అభివృద్ధికి నూతన పాలక వర్గం కృషి చేయాలి**

జిల్లా ఆదనపు కలెక్టర్ స్థానిక సంస్థల ఆధికారి అబ్దుల్ హామీద్ మాట్లాడుతూ ముందుగా నూతన పాలక వర్గానికి శుభకాంక్షలు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాక్రమంగా ద్వారా పట్టణంను మరింత అభివృద్ధిపథంలోకి తీసుకుపోయి హుస్నాబాద్ మున్సిపల్‌కు మంచి పేరు తేవాలని సూచించారు. ముఖ్యంగా పట్టణంలో పారిశుద్ధ్యం మంచినీటి సౌకర్యం మౌలిక వసతులు కల్పించాలని పాలక వర్గం అధికారులను కోరారు. అనంతరం నూతన పాలక వర్గానికి సన్మానం చేశారు .ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ చిత్తారి పద్మరవిందర్, కమీషనర్, మల్లికార్జున్,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## 2027 జనాభా లెక్కలు
## దేశాభివృద్ధికి కీలకం : కలెక్టర్




**ప్రజాపక్షం/జనగామ** :2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికే కీలకమని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఘా అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో కీలకం కావడంతో అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్ర స్థాయిలో బాధ్యతగా పనిచేసి జనాభా లెక్కల కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలన్నారు. జిల్లాలో జనాభా గణన 2027 సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి సందీప్‌కుమార్ ఘా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనాభా గణనను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో ఇళ్ల జాబితా గృహాల గణణ మే 11వ తేదీ నుండి జూన్ 9 వరకు రెండో దశలో జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నుండి మార్చి 1 వరకు జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌళిక సదుపాయాల ప్రణాళికలు రూపొందించడానికి జనాభా గణణ ద్వారా లబించే గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జనాభా గణను దేశంలో తొలిసారి డిజిటల్ విధానంలో నిర్వయించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణక ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రజలు తమ వివరాలను తాతే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి 15 రోజులు ముందే అందుబాటులోకి తీసుకురానున్నారన్నారు. మొదటి దశలో నిర్వహించే ఇళ్ల జాబితా, గృహాల గణనలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన పదార్థాలు, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు తాగునీరు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటి గది సౌకర్యం రేడియో, టెలివిజన్, స్మార్ఫోన్, సైకిల్, కారు లాంటి గృహ సౌకర్యాలకు సంబందించిన 33 ప్రశ్నలతో వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. శిక్షణ నిర్వాహకులు సిపిఓ చిన కోట్యానాయక్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో జనాభా గణన పక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గణాంక అధికారులు రవినాయక్, హిమవర్షతో పాటు వివిధ శాఖల అధికారులు, ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్న, ఎంపిడిఓలు తహాసీల్దార్లు పాల్గొన్నారు.



## పజాపాలన–ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధుల శిక్షణకు ఏర్పాటు చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్, మార్చి 12న నిర్వహించనున్న మున్సిపల్ ఛైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యుల శిక్షణా కార్యక్రమం నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనను మరింత ప్రజలకు చేరువ చేయడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం స్థానిక ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. అందుకు అనుగుణంగా నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి సంబంధించి శాఖల వారీగా మినిట్‌టుమినిట్ కార్యక్రమాన్ని రూపొందించి, అవసరమైన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేయబడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యాచరణను గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన క్లియర్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అదేవిధంగా ఆరోగ్యం, రోడ్డు భద్రత (అరైవ్ అలైవ్ కార్యక్రమం), సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు వాటి గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు.శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, అర్హులైన లబ్ధిదారులకు వాటిని చేరవేయడంలో ప్రజాప్రతినిధులు తీసుకోవలసిన చర్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలు వంటి అంశాలను వివరించాలని తెలిపారు. అలాగే తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, మున్సిపల్ చట్టాలకు సంబంధించిన ముఖ్యాంశాలను ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ట్రైనర్ల సహాయంతో శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.అనంతరం జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్ష నిర్వహించారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిరోజూ సమీక్షిస్తూ మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారుల నుంచి రోజువారీ నివేదికలు అందించాలని సూచించారు.ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, గ్రామాలు, పట్టణాల్లో శుభ్రత, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వనిత టీ స్టాల్ తరలింపుపై వివాదం

**ప్రజాపక్షం/జనగామ** :జనగామ కలెక్టరేట్ ముందు రోడ్డుపై ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్‌తో పాటు విజయ పాల డైరీ డబ్బాల తరలింపుపై వివాధం నెలకొంది. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఘా ఆదేశాల మేరకు మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డి, జనగామ తహశీల్దార్ మోసిన్ డబ్బాలను అక్కడ నుండి తీసేయాలని ఆదేశించిన నేపద్యంలో ఆందోళన నెలకొంది. ప్రభుత్వం కోటీ మంది మహిళల్ని కోటీశ్వరుల్ని చేయాలనే లక్ష్యంతో వ్యాపార రంగాల్లో వారిణి ప్రోత్సహిస్తుంది. గత కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ స్వయంగా వనిత టీ స్టాల్‌ను ప్రారంభించారు. నిర్వాహకులు రెండు లక్షలకు పైగా ఖర్చు చేసి మట్ట పోయించుకున్న పరిస్థితి. ప్రస్తుత కలెక్టర్ వేరే స్థలం చూపించకుండా అక్కడి నుండి తరలించాలని ఆదేశించడంతో నిర్వాహకులు ఆవేదన వెలిబుచ్చారు. వారికి అండగా సిపిఎం నాయకులు అక్కడకు వచ్చి డబ్బాలు తరలించేది లేదని బీష్మించుకు కూర్చున్నారు. అయితే ఈ డబ్బాల తొలగింపు ఎటువైపు దారి తీస్తుందన్నది చూడాలి. ప్రస్తుత జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఘా గతంలో సిరిసిల్ల కలెక్టర్‌గా ఉన్నప్పుడు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న డబ్బాలో కేటీఆర్ ఫోటో ఉండడంతో వివాధం జరగింది. జనగామ కలెక్టరేట్ ముందున్న డబ్బాలను తొలగిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందన్నది చర్చనీయాంశంగా ఉంది.

## విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షులు మందార పూర్ణచందర్ అన్నారు. దివిటిపెల్లి గ్రామానికి చెందిన ఏడు దొడ్ల విజయ్ యాకూబ్ రెడ్డి 41వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని మా ఇల్లు అనాధ ఆశ్రమ పిల్లలతో కలిసి వివాహ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా పిల్లలతో కలిసి లయన్స్‌క్లబ్ హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో భాగంగా కేక్ కట్ చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమం, పండ్లు పంపిణి నిర్వహించారు. అనంతరం వారు దివిటిపల్లి గ్రామంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీతో పాటు పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడాల పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి యుగందర్, కార్యదర్శి బాలరాజు, ఆశ్రమ నిర్వాహకులు శ్రీధర్, పూజ, క్లబ్ సభ్యులు రాజు, రొడ్డ రాజు, సోమేశ్వర్, సంతోష్‌కుమార్, శివప్రసాద్, భువనగిరి శ్రవణ్‌కుమార్, గ్రామస్థులు తిరుపతిరెడ్డి, జితేందర్‌రెడ్డి, ఎస్పాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జెడ్పీహెచ్‌ఎస్ జఫర్‌గడ్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థుకు వీడ్కోలు సమావేశం పాఠశాల హెచ్‌ఎం పద్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు బాగా రాసి స్కూల్‌కు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తేవాలన్నారు. ఈ వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, ప్రతాపరెడ్డి, శ్రవణ్‌కుమార్, వేణుగోపాల్, సునీత, రజిత, సీఆర్‌పీ పుట్ట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల జలాల విడుదల



**ప్రజాపక్షం/సంగెం:** మండల రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరాయి. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు, గవిచర్ల గ్రామ సర్పంచ్ బాసిపాక సదయ్య గారి ప్రత్యేక చొరవతో ఈరోజు ఉదయం దేవాదుల ప్రాజెక్టు ద్వారా ధర్మసాగర్ వద్ద నుంచి సాగునీటిని విడుదల చేయడం జరిగింది.పంటలకు సరిపడా నీరందక ఇబ్బందులు పడుతున్న సమయంలో, ఈ నీటి విడుదల రైతులకు ఎంతో ఊరటనిచ్చింది. ఈ సందర్భంగా గవిచర్ల గ్రామంతో పాటు సంగెం మండలంలోని వివిధ గ్రామాల రైతు సోదరులందరూ దేవాదుల జలాలను తమ పంటలకు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు.

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు..**

నీటి విడుదలకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులందరికీ సర్పంచ్ బాసిపాక సదయ్య గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికీ ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు స్థానిక మీడియా ప్రతినిధి మహబూబ్ పాషా ఒక పత్రికా ప్రకటనలో వివరాలను వెల్లడించారు.

# లక్ష్యం ఉంటేనే విజయం:కలెక్టర్



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** లక్ష్యం ఉంటేనే విజయం తథ్యమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విద్యార్థులకు ప్రేరణ కలిగించారు. మండలంలోని సింగరాజుపల్లి గ్రామ పంచాయితి పరిధిలో గల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు బోధనలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పాఠ్యాంశాలను ప్రతిరోజు ఖచ్చితంగా చదువుతూ లక్ష్యాన్ని పెట్టుకుని కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు. అనంతరం సింగరాజుపల్లి గ్రామ పంచాయితి పరిధిలో గల ఆరోగ్య ఉపకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. తదనంతరం మండలంలోని సింగరాజుపల్లి గ్రామ పంచాయితి పరిధిలోని అంన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యకరమంలో భాగంగా అదేగ్రామంలో కలెక్టర్ తనిఖీ చేశారు.వారి వెంట డీపీవో వసంత, హౌసింగ్ పీడీ మాతృనాయక్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### సర్పంచ్ నీల కవిత మురళి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** పదవ తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కొడవటూర్ సర్పంచ్ నీల కవిత మురళి పిలుపునిచ్చారు. బుధవారం కొడవటూరు పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సును హెచ్‌ఎం నరసింహస్వామి అద్యక్షతన నిర్వహించగా సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపేందుకు స్కూల్ టాపర్‌కు రూ.2వేలు, మండల టాపర్‌కు రూ.5వేలు, జిల్లా టాపర్‌కు రూ.10వేలు బహుమతిగా ఇస్తానన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ చైర్మన్ కొత్తపల్లి అంజమ్మ,గుడాల చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ప్రతినిధి సంతోష్, ప్రముఖ గైనకాలజిస్ట్ దయాకర్, ఉపాధ్యాయులు యాదగిరి, కిషన్, అంకుషావలి, రఘుమూర్తి, ప్రభాకర్, సిద్దులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉగాది పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ కమిషనర్




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థాన పంచాంగాన్ని బుధవారం దేవస్థాన కార్యాలయంలో వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్, భద్రకాళి దేవస్థాన కార్యనిర్వహణాధికారి రామల సునీత చేతుల మీదుగా ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి రామశ్వర్‌రావు, ఎక్స్ ఆఫీషియో ధర్మకర్త పార్శంది నర్సింహమూర్తిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ముఖ్య అర్చకులు చెప్పల వెంకట నాగరాజ శర్మలు పాల్గొన్నారు. తెలంగాణ జ్యోతిష పండితులలో వరంగల్ బ్రదర్స్ పేరు గాంచిన బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ సిద్ధాంతి, శాయికృష్ణ సిద్ధాంతి సోదరులచే గుణించబడిన తిథివార నక్షత్రయోగకరణంతో కూడిన ఈ పంచాంగాన్ని 13 జులై 2025 రోజున హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠంలో జరుపబడిన తెలంగాణ విద్యుత్ సభ సమావేశంలో సూర్య సిద్ధాంత రీత్యా(పూర్త సిద్ధాంత రీత్యా) నశాస్త్రీయమైనదిగా తెలంగాణ జ్యోతిష పండితుల ఆమోదాన్ని పొందడం వరంగల్ నగరానికి గర్వకారణమని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. పంచాంగంలో సూచించబడిన శుభ ముహూర్తములు గోచార, గ్రహోచారములు, ఈ పరాభవ నామ సంవత్సరం నందు దేశ రాష్ట్ర ఫలితాలు, వర్ష సూచనలు, పండగుల తిథి నిర్ణయం ధర్మశాస్త్రబద్ధంగా జరిపిన సిద్ధాంతులు అయినవోలు రాధాకృష్ణ కాయికృష్ణ శర్మల కృషి అభినందనీయమైనదని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం సిద్ధాంతి సోదరులను ఆలయ ధర్మకర్తలు సత్కరించారు. పంచాంగ శ్రవణం తేదీ 19 మార్చి 2026 గురువారం ఉగాది రోజున సాయంకాలం 7గంటలకు బ్రహ్మశ్రీ అయినవోలు రాధాకృష్ణ సిద్ధాంతి వరంగల్ భద్రకాళి దేవాలయంలో జరుపుతారని అందరూ విచ్చేయవల్సిందిగా ఆలయ ధర్మకర్తలు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ క్రాంతి కుమార్, ఆలయ అధికారులు కూచన హరినాథ్, శ్యామ్, నవీన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి ఆర్థోపెడిక్ సేవలు

**ప్రజాపక్షం/జనగామ:**అతి తక్కువ ఖర్చుతో జనగామ జిల్లా కేంద్రంలోకి ఆర్థోపెడిక్ సేవలు అందుబాటులోకి వచ్చాయని హైదరాబాద్ సోమాజిగూడ యశోధ హాస్పటల్ అర్థోపెడిక్ సర్జన్ మేడగం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జనగామలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రెండు, నాలుగో మంగళవారం జనగామలోని ఎస్ఎస్‌కె హాస్పటల్‌లో ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందించడంతో పాటు హైదరాబాద్ యశోధలో అదునాతన పద్ధతిలో శస్త్రచికిత్సలు చేయబడతాయన్నారు. బుజం, మోకాలు, తొంటి నొప్పులు, ఆపరేషన్లపై తాను సౌత్ కోరియా, ఇటలీ, దుబాయిలో ప్రత్యేక శిక్షణ పొందడం జరిగిందన్నారు. ఆ శిక్షణతోనే హైదరాబాద్‌లోని సోమాజిగూడలో యశోద హాస్పటల్‌లో అనేక మందికి శస్త్ర చికిత్సలు చేశానని, జనగామలోనూ పలువురికి శస్త్ర చికిత్స చేసి మోకాళ్ల ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. కార్పొరేట్ హాస్పటల్స్ అనగానే భయ పడుతున్న పరిస్థితి ఉందని, ఆ భయాన్ని పోగొట్టేందుకే గ్రామీణ స్థాయిలో మెరుగైన వైద్య సేవలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పేషంట్లు ఆపరేషన్ ముందు, తరవాత హైదరాబాద్ వెళ్తున్నారని, ఇప్పటి నుండి అలాంటి అవసరం లేకుండానే జనగామలోని ఎస్ఎస్‌కెలో ఆర్థో సేవలు అందించడం జరుగుతుందన్నారు. యశోద హాస్పటల్‌కు ప్రత్యేకత ఉందని, ఆ ప్రత్యేక కలిగిన హాస్పటల్‌లో పనిచేసే వైద్య నిపుణులే జనగామకు వచ్చి వైద్యం చేస్తున్నారంటే గ్రామీణ స్థాయికి వైద్యం ఎలా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చునన్నారు. జనగామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎస్ఎస్‌కె హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి కృష్ణ, యశోద హాస్పటల్ మార్కెటింగ్ మేనేజర్ ఉమేస్, కార్య నిర్వాహకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుష్టికరమైన భోజనాన్ని అందించాలి



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**విద్యార్థులకు పుష్టికరమైన భోజనాన్ని అందించాలని బండ్ల గూడెం సర్పంచ్ పోరెడ్డి సంతోషి మల్లారెడ్డి, ఉపాధ్యాయురాల్లకు సూచించారు. బుధవారం మండలంలోని బండ్ల గూడెం గ్రామంలోని గల, కస్తూర్బా గాంధీ పాఠశాలను, ఆమె అకస్మాత్తుగా, సందర్శించారు. తరగతి గదులను, వంటశాలను, పరిశీలించి సలహాలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో కలిసి ఆమె సమిష్టి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో, కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్, ఎల్.అన్నపూర్ణ, ఉప సర్పంచ్, గట్ట గల్ల నవీన్, రెండవ వార్డ్ సభ్యులు, చల్ల భూపాల్ రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రటరీ సంతోష్ మాత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి దయాకర్‌రావు

**ప్రజాపక్షం/జనగామ:**జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఘాను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యల్ని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ జనగామ జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. అలాగే పలు సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకొచ్చామని, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పొరపాట్లు జరిగినందున రెండు మూడు పంచాయతీల్లో రీ కౌంటింగ్ నిర్వయించాలని కోరడం జరిగిందన్నారు. గ్రామ కార్యదర్శులను అధిక సంఖ్యలో బదిలీ చేసినందున ఆ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తెచ్చానన్నారు. అదే విధంగా ఇజిఎస్ నిధులు పూర్తిగా గ్రామ పంచాయతీ సర్పంచ్ పరిధిలో జరుగుతాయని, వారు తీసుకునే నిర్ణయాలు, తీర్మాణాల మేరకే పనులు చేయాల్సి ఉంటుందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో నిబంధనలకు విరుద్దంగా జరుగుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తెచ్చానన్నారు. పలు అంశాలపై కలెక్టర్ స్పందించారని, ఏ విషయం అయినా తనకు నేరుగా తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. కలెక్టర్‌కు తెలియజేసిన అంశాలపై వారు స్పందిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పల్లా సుందర్‌రాంరెడ్డి, మాజీ ఎంపిపి మల్లేశం, మండల పార్టీ అధ్యక్షులు వినయ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నర్సింహులపేట:**గ్రామీణ యువత ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారయణ రెడ్డి చెప్పారు.బుధవారం మండలం కేంద్రంలోని ఎంపిడిఓ ఆఫీసులో నిర్వహించిన పిఎంఇజిపి ఒకరోజు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.గ్రామీణ ప్రాంతంలో యువత ,స్వయం సంఘాల మహిళలు వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఈ పథకం ఒక వరంలాంటాదని చెప్పారు.ఈ పథకంల కింద లభించే బ్యాంకు ఋణాల సబ్సిడీలు అర్హతలు ప్రమాణాలు,దరఖాస్తు విధానం స్వయం ఉపాధి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు.కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ మేనేజర్,ఎస్బిఐ యాదగిరి,ఈడీసీ మేనేజర్ మహేష్,ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ నిఖిల్,చైల్డ్ ప్రొటెక్షన్ అసిస్టెంట్ ఆఫీసర్ వీరన్న,లాలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై దాడి..

**ప్రజాపక్షం/నర్సింహులపేట:**మండలంలోని పెద్దనాగారం స్టేజీ సమీపంలో పేకాట స్థావరాలపై స్థానిక ఎస్సై మాలోతు సురేష్ తన సిబ్బందితో కలసి దాడి నిర్వహించారు.కొంత మంది పేకాట ఆడుతున్నారనే పక్క సమాచారం మేరకు దాడి చేయాగా నలుగురు వ్యక్తులను పట్టుకునే క్రమంలో ఇద్దరు పారిపోయారు. వారి వద్ద నుండి 17700రూపాయాలు,మూడు బైకులు,మూడు ఫోన్లు స్వాదినం చేసుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

## గూడూరు మండలంలో బిజెపి ముందస్తు సమావేశం



**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో భారతీయ జనాతా పార్టీ ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ శిబిరం నిర్వహిణకు సంబందించి ముందస్తు సమావేశం నిర్వహించారు.ఈసమావేశానికి బీజేపి మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది.ఈకార్యక్రమానికి మానుకోట బీజేపి జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర యోడి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఆ పథకాలు గురించి గ్రామ గ్రామాన ప్రజలకు వివరించి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు.అలాగే బాలికలకు క్యాన్సర్ నివారణకు ఉచితంగా వ్యాక్సిన్ అందించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ద భమాలు నెలకొన్న పరిస్థితుల్లో కూడా భారతదేశ ప్రజలు సుఖశాంతులతో జీవంచడానికి ప్రధాని యోడి పాలన దక్షతే కారణమని పేర్కొన్నారు.త్వరలో గూడూరు మండల కేంద్రంలో జరగబోయే పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని పార్టీ నాయకలు కార్యకర్తలు సమన్వయంతో విజమవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా మండల నాయకకులు చిల్పూరి వెంకన్న మేరెడ్డి సురేందర్ నరసింహారెడ్డి అనిల్ నాగరాజు మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## మజీద్ కమిటీని ప్రకటించిన రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్



**ప్రజాపక్షం/తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని స్థాని జామా మసీద్ కమిటీని తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రకటించింది. అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్ లీమ్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ మౌలానా పాషా, మహమ్మద్ షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అమీర్, కోశాధికారిగా మహమ్మద్ గౌస్ మైనొద్దీన్, కమిటీ మెంబర్స్‌గా మహమ్మద్ యాకూబ్‌పాషా, సయ్యద్ చాంద్ పాషా, మహమ్మద్ అబ్దుల్ గని, మహమ్మద్ ఎజాజ్, మహమ్మద్ అమీనుల్ ఇస్లాం, మహమ్మద్ సలామ్ పాషాలను ప్రకటించగా నియామకపత్రాన్ని మహబూబాబాద్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ నజీముద్దీన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అలీమ్, ఉపాధ్యక్షుడు మౌలానాపాషా, ప్రధాన కార్యదర్శి అమీర్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ తొర్రూరు జామా మసీద్ కమిటీని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, సీఈవోకు, మహబూబాబాద్ జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ నజీముద్దీన్ కమిటీ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. మసీద్ అభివృద్ధి కోసం తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని, మసీద్‌కు సంబంధించిన వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యతను కల్పిస్తూ పట్టణ, మండలంలోని ముస్లిం సోదరుల సంక్షేమం కోసం స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సహకారంతో కృషి చేస్తామన్నారు. ముస్లింలందరిని కలుపుకొని ముందుకు వెళ్తామంటూ కమిటీ ఏర్పాటుకు పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ షేక్ యాకూబ్‌పాషా కుటుంబానికి ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## కెటికెఫైవ్ ఇన్‌క్లయిన్ సెక్రెటరీగా వి.రాజేందర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:**భూపాలపల్లి ఏరియాలో కేటీకే ఫైవ్ ఇంక్లైన్ నూతన ఫిట్ సెక్రటరీగా వి రాజేందర్ ను ఎన్నుకున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రం లోని కొమురయ్య భవన్‌లో కేటీకే5 ఇంక్లైన్ పిట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎండి ఆసిఫ్ పాషా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ అధ్యక్షత వహించగా, బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీకే5 ఇంక్లైన్ గనిలో యూనియన్ ఆర్గనైజేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలకు తగిన సూచనలు చేశారు. అలాగే దీర్ఘకాలంగా పిట్ సెక్రటరీగా పనిచేస్తూ యూనియన్‌కు విశేష సేవలు అందించిన దోర్నాల తిరుపతి సేవలను కార్యకర్తలకు గుర్తు చేశారు. రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న నేపథ్యంలో యువతకు అవకాశం ఇవ్వాలని కోరడంతో నూతన పిట్ సెక్రటరీ గా వి. రాజేందర్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా దోర్నాల తిరుపతి ని బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నుకున్నారని తెలిపారు.ఇద్దరూ కలిసి యూనియన్ ఆర్గనైజేషన్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని రమేష్ కోరారు. ఈ పిట్ కమిటీ సమావే శంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు జి.సుధాకర్ రెడ్డి, జి. శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్, మాతంగి రామ్ చందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఇంచార్జ్ నూకాల చంద్రమౌళి, టెక్నీషియన్ ఇంచార్జ్ రవికుమా ర్, బ్రాంచ్ నాయ కులు పోశం, సేఫ్టీ కమిటీ, మైన్స్ క మిటీ, పిట్ కమిటీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తుమ్మచెట్లను స్వాధీనం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లాలోని నెక్కొండ మండలం పనికర ఊర చెరువులో ఉన్న తుమ్మ చెట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన అతివృష్టి వర్షాల కారణంగా చెరువులోని కొంత భాగం నీటితో నిండిపోవడంతో పాటు, ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు వట్టె గడ్డికి నిప్పు పెట్టడంతో మండల వేడికి పలు చోట్ల తుమ్మ చెట్లు ఎండిపోయి చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ చెట్లను సంబంధిత అధికారులు లేదా గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకొని వేలం వేస్తే ప్రభుత్వానికి కొంత ఆదాయం వచ్చే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు. లేకపోతే గుర్తు తెలియని వ్యక్తులు వాటిని దొంగలించే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## నెక్కొండలో రెండు కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు

**ప్రజాపక్షం/నెక్కొండ:**రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి రవి తెలిపారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ హైస్కూల్ నెక్కొండలో ఒక సెంటర్ అలాగే ఫాదర్ కొలంబో పాఠశాలలో మరో కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జడ్పిహెచ్ఎస్ కేంద్రంలో 207 మంది విద్యార్థిని విద్యార్థులు, ఫాదర్ కొలంబో కేంద్రంలో 280 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. మొత్తం 487 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, పరీక్షల నిర్వహణకు 27 మంది పర్యవేక్షకులను ప్రభుత్వం నియమించినట్లు ఎంఈవో వివరించారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30గంటల నుండి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## బ్రిడ్జిపై డివైడర్ ఏర్పాటుచేయాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ పట్టణం నుండి సిద్దిపేటకు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై వాహన రాకపోకలు ఎక్కువగా ఉండడం వలన ఈ బ్రిడ్జిపై సెంటర్ డివైడర్ లేకపోవడంతో వాహనాలు ఎదురెదురుగా వేగంగా రావడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కావున డివైడర్ ఏర్పాటుచేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు మడిపడిగ చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదేవిధంగా జనగామ నుండి సూర్యపేటకు వెళ్లే రహదారిలో నెల్లుట్ల గ్రామ పరిధిలో ఉన్న బ్రిడ్జిపై కూడా సెంటర్ డివైడర్, బైపాస్ నుండి వచ్చే వాహనాలకు యూ టర్న్ బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్, నాయకులు అర్జున్, లావణ్య, రాజేశ్వరి, నవనీత, సిద్దులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన

**ప్రజాపక్ష/ తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, శారదాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైనదని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయ వృత్తి అత్యంత కీలకమైందన్నారు. ప్రాథమిక స్థాయిలోనే పిల్లల్లో నాయకత్వ లక్షణాలతో పాటు సృజనాత్మకత, అంకితభావం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. డీఈఓగా ఆసిఫ్, ఎంఈఓగా మోహన్‌నాథ్, చరణ్, ప్రధానోపాధ్యాయులుగా అభినయ్, సహస్ర, ఉపాధ్యాయులుగా రాహుల్, రాజ్‌కమల్ కుమార్, తనూజ, రిషికి, సందేశ్, అక్షణ, నిఖిల్, మహేశ్, గణేశ్, దైవిక్, సాగర్, శ్రేయసి, విమలాదేవి, రాయల్, రేణుక, హుస్సేన్, రోజ, మమత, పల్లవి, క్రీడల ఉపాధ్యాయునిగా రుత్విక్‌తో పాటు తదితరులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సరిత, సునిత, సంధ్యారాణి, ప్రవీణ్‌కుమార్, శిరీష, యమున, సతీశ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## 14,15న సూర్యాపేట జిల్లా కేంద్రంలో శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/తొర్రూరు :** ఈ నెల 14,15న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా( టీయూసీఐ) రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని టీయూసీఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకొని బ్రతకడానికి కూడా పరిస్థితులను కల్పించకుండా వారు తమ జీతాల కోసం తమ పని పరిస్థితుల మెరుగు కోసం ఐక్యం కావాలన్నారు. మోదీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. టీయూసీఐ వివిధ రంగాల కార్మికులకు తమ సమస్యల పట్ల, హక్కుల గురించి అవగాహన కల్పించడానికి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మాణం చేసి పంపాలని టీయూసీఐ డిమాండ్ చేస్తుందన్నారు. సూర్యాపేటలో ఈ నెల 14, 15న జరిగే శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీయూసీఐ తొర్రూరు ఏరియా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాం పుల్లయ్య, ఎండి.షరీఫ్, పాద్య బీకు, అర్వపల్లి వెంకన్న, మాచర్ల మురళి, గుండాల సోమనర్సయ్య, వడ్లకొండ లక్ష్మయ్య, పాల్గొన్నారు.

## డయాబెటిస్ రోగులకు ఉచితంగా ఇన్సులిన్ ఇవ్వాలి:సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/మరిపెడ:**డయాబెటిస్ టైప్‌వన్ తో బాధపడుతున్నా రోగులకు ఉచితంగా ఇన్సులిన్ ఇచ్చి,పెన్సన్ ఇవ్వలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన మహబుబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామాచంద్రు నాయక్ ను కలిసి వినతి పత్రం ఇచ్చారు.ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ టైప్ వన్ డయాబెటీస్ రోగులు జీవితాంతం ఇన్సులిన్ పై ఆధారపడల్సి వస్తుందని,ప్రతి నేల పది పదిహేను వెల రూపాయలు ఖర్చుచేయల్సిన దుస్థితి భరించలేక ఇబ్బంది పడుతున్నారని,కనుక ప్రభుత్వం వెంటనే స్పందించి ఆసుపత్రుల ద్వార ఉచితంగా ఇన్సులిన్ ఇచ్చి,ప్రత్యేకపెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చర్చీలకు నిధులు మంజూరు చేసిన మంత్రికి కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**కాటారం సబ్ డివిజన్ పరిధిలోని చర్చిలకు 2 కోట్ల 55 లక్షలు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు డివిజన్ అధ్యక్షుడు ఎం డేవిడ్ మార్క్,కార్యదర్శి జీవరత్నం,జాయింట్ సెక్రెటరీ ప్రకాష్ కోశాధికారి బన్సిలాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు..కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని పలు చర్చిలకు నిధుల మంజూరు కాలేదని సబ్ డివిజన్ పరిధిలో 93 మంది పని చేస్తున్నారని తెలిపారు.కాటారం సబ్ డివిజన్ పరిధిలోని సభ్యుల అనుమతి లేకుండా పలువురు తమ స్వార్థంకోసం అవసరానికి మించి నిధులు వచ్చేలా ప్రయత్నించారని అవసరమైన వారికి రాలేదని ఆవేదన వ్యక్తం చేసారు.మంత్రి శ్రీధర్ బాబు అవసరమైన వారిని గుర్తించేలా అధికారుల ద్వారా పరిశీలన చేయించి తగు నిధులు మంజూరు చేయగలరని తెలిపారు.

## ఆరు గ్యారంటీల హామీ తుంగలో తొక్కిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/నర్సింహులపేట:**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను నిండా ముంచిందని బిజెపిజిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ మండిప డ్డారు .బుధవారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు సురబోయిన సతీష్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహి ంచారు.డోర్నకల్ ఎమ్మెల్యేకు రాం చంద్రు నాయక్‌కు నియోజికవర్గంపై ఎలాంటి అవగాహన లేదని నియోజిక వర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు.ప్రజల బాగోగులు పట్టించుకోకుండా గ్రామాల పర్యటన చేయకుండా పట్టణ పర్యటనలు చేస్తున్నరని తెలంగాణలో రాక్షస పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.కార్యక్రమంలో గ్రామ లీడర్లు కుంభం అశోక్‌రెడ్డి,బీనపెల్లి రమేష్,మెరుగు యాకన్న,ఎరనాగి కుమారస్వామి,డొనికెన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డిజిటల్ లర్నింగ్‌లో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు సత్కారం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ కలెక్టరేట్‌లో రెండు రోజుల పాటు డిజిటల్ లెర్నింగ్, రోబోటిక్స్, ఏఐ, ఎంఎల్ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాలలో మొదటి రోజు విద్యార్థుల కోసం నిర్వహించగా, రెండో రోజు టెక్నాలజీ సమన్వయంతో బోధనలో విశేష కృషి చేసిన 25 ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యమూర్తి, అర్వాజ్ మాలిక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడిని కలిసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ్యుడిగా విజయవంతంగా సేవలు అందించి రాష్ట్ర అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# వంట గ్యాస్ ధరలు తగ్గించాలి

### సిపిఎం డిమాండ్



**ప్రజాపక్షం/గూడూరు;**వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఎం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం గూడూరు మండల కేంద్రంలో సిపిఎం గూడూరు మండల కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సమస్యలపై వినతి పత్రాన్ని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగభవానికి సమర్పించారు. ఈసందర్భంగా సీపీఎం గూడూరు కొత్తగూడ గంగారం ఏరియా కమిటీ కార్యదర్శి నక్క సైదులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలతో పాటు వంట గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. గ్యాస్ ముడి సరుకు ధరల పెరుగుదల పేరుతో గృహ వినియోగ సిలిండర్‌పై రూ60 కమర్షియల్ సిలిండర్‌పై రూ115 పెంచడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని వారు అన్నారు. గ్యాస్ ధరలు పెరగడం వల్ల ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా పేద ప్రజలు మరింత ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే వంట గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు అడ్డూరి బ్రహ్మాచారి కోరంభాగ్య మన్యం మల్లేష్ వీరన్న రాములు వెంకన్న చారి లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

### సర్పంచ్ గుండె శివకుమార్



**ప్రజాపక్షం/నర్సాపూర్:**పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థు లు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి పే రు ప్రతిష్టలు తీసుకురావాలని పెద్ద చింతకుంట సర్పంచ్ గుండె శివకుమార్ అన్నారు. బుధవారం నర్సాపూర్ మ ండల పరిధిలోని పెద్ద చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫేర్వెల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచిగా రాసి మండల జిల్లా రాష్ట్ర ర్యాంకులు సాధించి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు ఆయన పరీక్షలకు ఉపయోగపడే సామాగ్రిని స్థా నిక యువకుడు రాకేష్ గౌడ్ సాకారంతో అందజేసిన ప రీక్ష సామాగ్రిని సర్పంచ్ చేతుల మీదుగా విద్యార్థులకు ప ంపిణీ చేశారు. అనంతరం పాఠశాల స్థాయిలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనను గ్రామస్తులతో కలిసి సందర్శించా రు. విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టిక్ రహిత సమాజం వనమహోత్సవం నకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమా లు విద్యార్థులు చేయగా వాటిని చూసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళ అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో అవకాశాలు




**ప్రజాపక్షం/కమలాపూర్:**మహిళల అభివృద్ధి, సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు, అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోని మహిళలు ముందుకు సాగాల ని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పబ్బు స తీష్ అన్నారు. జిల్లా సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కమలాపూర్ ఎంపిడిఓ సమావేశ మందిరంలో ని ర్వహించిన మహిళల కోసం పని చేసే స్థానిక వ్యవస్థల సమన్వయం కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆకాశమే హద్దుగా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, విజ్ఞానపరంగా ముందడుగు వేశారని, అన్ని రంగాలలో అసమాన ప్రతిభను కనబర్చి దీటుగా రాణిస్తున్నారని అన్నారు. సర్వోదయ సంస్థ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ వి. ఇందిర మాట్లాడుతూ... లింగ నిష్పత్తిలో తేడాకు లింగ వివక్ష కారణం అని, గ్రామాలలో మొదట ఆడపిల్ల పుట్టి, రెండవ సారి గర్భం అని తెలియగానే బయట స్కానింగ్ తీయించుకొని గర్భ విచ్ఛిత్తి చేయించుకుంటున్నారని అన్నారు. అది నేర పూరిత చర్య అని అన్నారు. కుటుంబంలో చిన్నప్పటి నుండి పిల్లల అలవాట్లు, మాటలు పర్యవేక్షణ చేయాలని, అవసరం అయిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ఐకెపి సిసిలు, అంగన్‌వాడీ టీచర్లు, కార్తీక్ ఉపాధిహామీ పథకం ఏఈ, కమ్యూనిటి లీడర్స్ ఓదేలు, సరిత, కళ్యాణి, ఈశ్వరి, సర్వోదయ సంస్థ అక్తర్, సుహాసిని, వివోఏలు, ఆశాలు పాల్గొన్నారు.

# ఉచిత కంటి పరీక్షలు

**ప్రజాపక్షం/తాద్వాయి:**గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే సంకల్పంతో బిఆర్ఎస్ జిల్లా నాయకులు భూక్య జంపన్న ఆధ్వర్యంలో తాద్వాయి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం 26వ విడత ఉచిత మెగా కంటి వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరానికి తాద్వాయి మండలంతో పాటు పరిసర మారుమూల గ్రామాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కంటి పరీక్షలు చేయించుకోవడం విశేషం. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులు ప్రజలకు కంటి సంబంధిత పలు పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు తగ్గడం, కంటి అలర్జీలు, ముత్యబిందు వంటి సమస్యలను గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్ కొరకు ప్రత్యేక బస్సుల్లో హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి పంపడం విశేషం, ఈ శిబిరం ద్వారా పేద, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగడం కలిగిందని స్థానికులు తెలిపారు. గ్రామాల్లో నివసించే ప్రజలకు వైద్య సదుపాయాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని భూక్య జంపన్న స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు తోడుగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు ములుగు జిల్లా వ్యాప్తంగా, పరిసర ప్రాంతాల్లో సుమారుగా 26 విడతలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ఆయన సేవా భావానికి నిదర్శనంగా నిర్వహించడం ఆయన సేవా భావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా భూక్య జంపన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే తన ముఖ్య లక్ష్యమని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఖరీదైన చికిత్సలు చేయించుకోలేని పరిస్థితుల్లో ఉచితంగా పరీక్షలు, మందులు అందించడం ఎంతో అవసరమని అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించి తాద్వాయి గ్రామ సర్పంచ్ గంట ప్రవళిక గన్నులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గం నవీన్, మాజీ ఉప సర్పంచ్ ఆలేటి ఇంద్రరెడ్డి, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు తుమ్మల రాజేందర్, యూత్ నాయకులు మనుకొండ నవీన్, చీమల శ్రవణ్ కుమార్, కొత్తూరి రోహిత్, గట్టు వంశీ, ఠాకూర్, సురేందర్, కల్లేబోయిన రాకేష్, గంట మనోజ్ రెడ్డి, కిట్టు గణేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే రోజు రెండు ప్రసవాలు

**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రెండు ప్రసవాలు జరిగాయి. మర్రిపల్లి గూడెం, గోపాల్‌పూల్ గ్రామానికి చెందిన ఇద్దరు గర్భిణీలు పురిటి నొప్పులతో ఆసుపత్రికి రాగా గైనకాలజీ డాక్టర్ రమ్య ఇద్దరికి సిజేరియన్ చేయగా ఒకరికి బాబు పుట్టగా, మరొకరికి పాప పుట్టారు. అందులో ఒక గర్భిణీ స్త్రీ జన్యు రీత్యా కంటి చూపు సమస్య లోపాలతో బాధ పడుతున్నప్పటికి అన్ని పరీక్షలు చేసి సిజేరియన్ చేయడం జరిగిందని, ఆమెకు పాప పుట్టారని, ఆ పాపకు ఎలాంటి పుట్టుక లోపాలు లేవు. చాలా సాహసం చేసి సిజేరియన్ చేయడం జరిగింది. పాప ఇప్పుడు సురక్షితంగా ఉంది. కుటుంబ సభ్యులు చాలా సంతోషం చేశారు. వైద్యురాలుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా తుమ్మ శోభన్ బాబు

**ప్రజాపక్షం/కమలాపూర్:**కమలాపూర్ మండలానికి చెందిన తుమ్మ శోభన్ బాబును తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాష్ట్ర అధ్యక్షులు, డాక్టర్ సీమ శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శోభన్ బాబు మాట్లాడుతూ... తన పై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సీమ శ్రీనివాస్‌కు, నియామాకానికి సహకరించిన రాష్ట్ర నాయకులు మోకిడే ప్రసాద్, మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు మోటం సంపత్, జిల్లా ఉద్యమ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరే వరకు ఉద్యమకారులతో కలిసి పోరాటం కొనసాగిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇల్లు స్థలం ఇవ్వడం, ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు సుమారు రూ. 10 లక్షల వరకు ఆర్థిక సహాయం, రూ. 25 వేల పింఛన్ అందించాలన్న హామీల అమలుకు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసుల ఉప సంహరణ, ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలలో ప్రాధాన్యం కల్పించాలన్న అంశాల పై పోరాటం చేస్తామన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న హామీల అమలు కోసం కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను ఐక్యం చేసి వారి హక్కుల సాధనతో పాటు తెలంగాణ పునర్నిర్మాణం కోసం తాను పనిచేస్తానని అన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్

**ప్రజాపక్షం/ములుగు:**మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన కనుగంటి మీనమ్మ అనారోగ్యంతో గత కొద్ది రోజుల క్రితం మరణించగా బాధిత కుటుంబాన్ని ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి బుధవారం సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆమె వెంట శ్రీకాంత్ రెడ్డి, కృష్ణా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంగడి వేలం@24లక్షల4వేలు..



**ప్రజాపక్షం/నర్సింహులపేట:**మండల కేంద్రంలోని ప్రతి శనివారం నిర్వహించే అంగడిని బుధవారం నిర్వహించిన వేలంలో నర్సంపేటకు చెందిన ప్రభాకర్ కైవసం చేసుకున్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఓపెన్ వేలం పాట జరుపగా24లక్షల4వేలకు ప్రభాకర్ అనే వ్యక్తి వేలం పాటలో కైవసం చేసుకున్నారు.గతంతో పోల్చుకుంటే ఈసారి రికార్డు స్థాయిలో వేలం పాట జరిగిందని ఇంత పెద్ద మొత్తంలో వేలంపాట జరుగడం ఇదే మొదటిసారని గ్రామస్థులు అంటున్నారు.కాగా మండలంలోని పెద్దనాగారం స్టేజీలో ప్రతి గురువారం జరిగే సంతను 77వేలకు చేలిమల్ల నరేష్ కైవసం చేసుకున్నారు.ఈ వేలం ఒక సంవత్సరం వరకు ఉంటుందని అధికారులు చెప్పారు.కార్యక్రమంలో ఎంపీవో కిన్నెర యాకయ్య,స్థానిక సర్పంచ్ పెదమాముల యాకయ్య,ఉపసర్పంచ్ కాస యాకయ్య,పెద్దనాగారం స్టేజీ సర్పంచ్ భూక్య సోనియాహరిలాల్,కార్యదర్శులు వెంకటేశ్వర్లు,వనిత పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించాలి

**ప్రజాపక్షం/వేలేరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేషపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని వేలేరు గ్రామసర్పంచ్ బిల్ల యాదగిరి లబ్దిదారులను కోరారు.బుధవారం వేలేరు మండలకేంద్రంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో మొదటి విడుత ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు .ఈసంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు సకాలంలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని లేని యెడల ప్రభుత్వ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకొని ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు.సకాలంలో ఇండ్ల నిర్మాణాలు చేయకపోతే మల్లీ రెండవ విడుత ఇండ్ల మంజూరులో జాప్యం జరిగే అవకాశాలు ఉంటాయి కనుక లబ్దిదారులు సకాలంలో ఇండ్లను పూర్తిచేస్తేనే గ్రామానికి మంచి గుర్తింపు వస్తుందని ఇంకా గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమలు చేపట్టడం జరుగుతోందని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి,ఉపసర్పంచ్ కోడూరి శ్రీకర్,హౌజింగ్ ఎఇ జాన్సీ,గ్రామపంచాయితీకార్యదర్శి రవిందర్,మండల సమాఖ్యఅధ్యక్షురాలు ఆల్ల రేణుక,పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ బైరి రాణి,వార్డు సభ్యులు మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ పరికరాల పంపిణీ

**ప్రజాపక్షం/నడికూడ:** హనుమకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్ల గ్రామంలోని ఏంపియుపిఎస్ పులిగిల్ల పాఠశాలలో ముకాంబిక ఫౌండేషన్,వరంగల్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్సిల్స్,పెన్స్,ఎరేజర్లు ఇతర ఎగ్జామ్ పరికరాలు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ముకాంబిక ఫౌండేషన్ నిర్వాహకులు వరంగల్‌కు చెందిన దొడ్డ రమేష్ కుమార్,దేవా అరవింద్, సూర్యదేవర సదానంద,రమేష్, సిద్ధూ,ధీరజ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుల్యాల సంపత్ రెడ్డి సీనియర్ ఉపాధ్యాయులు కటుకోజ్వల సతీష్ మాట్లాడుతూ,విద్యార్థుల చదువుకు అవసరమైన సామగ్రిని అందించడం చాలా అభినందనీయమని సమాజంలో విద్యాభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు.పాఠశాల తరఫున ముకాంబిక ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా,కవిత, ప్రదీప్, రమేష్,కార్తీక్,అంగన్వాడి టీచర్ పాల్గొన్నారు.

## అల్మారి స్మశాన వాటికకు అందజేత

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ కాపువాడ వాస్తవ్యులు దివంగత దాది సాంబయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు దాది వేణు, దాది వంశీ కాపువాడలోని మున్నూరు కాపు స్మశాన వాటికలో ఆస్తికలను భద్రపరిచేందుకు అల్మారిని 24 రాక్ లతో హైదరాబాదులో ప్రత్యేకంగా తయారు చేయించి బుధవారం కాపువాడలోని మున్నూరుకాపు స్మశానవాటిక పెద్దల సమక్షంలో అందించడం జరిగినది. ఈ సందర్భంగా వారి కుమారులు మాట్లాడుతూ మునుముందు కాపువాడలో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా కాపువాడ పెద్దలు, ప్రజలు అల్మారి అందించిన దాది సాంబయ్య కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఎల్‌ఓసీ కాపీ అందజేత



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** హనుమకొండ సుబేదారి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని అర్వపల్లి గ్రామానికి చెందిన మంచాల కమల అనారోగ్య సమస్యతో బాధపడుతున్న నేపథ్యంలో అతనికి చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.5,00,000 విలువైన ఎల్‌ఓసీ కాపీని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ ఎల్‌ఓసీ ద్వారా హైదరాబాద్ నిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదల వైద్య అవసరాల విషయంలో అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని, స్థానిక శాసనసభ్యుడిగా తన దృష్టికి వచ్చే ప్రతి అనారోగ్య సమస్యపై తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.అలాగే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ, లక్షల రూపాయలు ఖర్చయ్యే ప్రైవేట్ ఆసుపత్రుల చికిత్సలకు వెళ్లి అప్పుల పాలుకాకుండా, ప్రభుత్వ నిమ్స్ వంటి ఆసుపత్రుల్లో తాను అందించే ఎల్‌ఓసీల ద్వారా ఉచితంగా మెరుగైన వైద్యం పొందాలని సూచించారు.ఈ సందర్భంగా బాధితురాలు మంచాల కమల కుటుంబ సభ్యులు, ఆపత్కాలంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తూ తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హసన్పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, యూత్ నాయకులు జట్టి యుగేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయంతో భూసారాన్ని పెంచవచ్చు

### రామానుజాపూర్ క్లస్టర్ ఎఇఒ సునీల్ కుమార్




**ప్రజాపక్షం/వెంకటాపూర్:** ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభం కలుగుతుందని వెంకటాపూర్ మండలంలోని రామానుజాపూర్ క్లస్టర్ ఏఈవో సునీల్ కుమార్ అన్నారు. పాలంపేట గ్రామంలో (నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫామింగ్)పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన సాగు ఖర్చు తగ్గడం, భూమి సారాన్ని పెంచుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోవడం, పర్యావరణాన్ని కాపాడుకోవడం వలన రైతులు అధిక లాభాలు పొందవచ్చని, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి లు వీరమల్ల సరళ, ఎలగొండ అరుణ, గ్రామ రైతుసంఘం సభ్యులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల ఆత్మగౌరవ శిఖరం 'డాక్టర్' పీర్ల కృష్ణబాబు

### విద్య, సేవారంగాల్లో అరుదైన గుర్తింపు



**ప్రజాపక్షం/వాజేడు:** ఒక సామాన్య రైతు బిడ్డగా మారుమూల గ్రామం నుండి ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొంది యావత్ ఆదివాసీ సమాజం గర్వపడేలా చేశారు పీర్ల కృష్ణబాబు. విద్యను ఆయుధంగా మలుచుకుని, సామాజిక సేవను ఊపిరిగా చేసుకున్న ఆయనకు ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా కృష్ణబాబు ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు.అట్టడుగు నుండి అగ్రస్థానం వరకు ఆయనది ఒక స్ఫూర్తిదాయక ప్రస్థానం. ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన కృష్ణబాబు, పేదరికాన్ని జయించడానికి విద్యే సరైన మార్గమని నమ్మారు. కష్టపడి చదివి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి, వేలమంది విద్యార్థుల భవితకు బాటలు వేస్తూ 'విద్యా కుసుమం'గా పేరు తెచ్చుకున్నారు. ఆయన ఎదిగిన తీరు నేటి యువతకు ఒక గొప్ప పాఠం.తెలంగాణ ఉద్యమంలో పోరాట యోధుడుగా కేవలం వృత్తికే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తిగా కృష్ణబాబు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. సకల జనుల సమ్మె సమయంలో ప్రజల హక్కుల కోసం వీరోచితంగా పోరాడి, ఒక సామాజిక ఉద్యమకారుడిగా తనదైన ముద్ర వేశారు.

**కరోనా వేళ కదిలే ప్రాణం.. కృష్ణబాబు మానవత్వం**

కరోనా కష్టకాలంలో లోకమంతా భయంతో వణికిపోతున్న వేళ, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కృష్ణబాబు గారు సేవా రంగంలో దూసుకుపోయారు.4000 మందికి పైగా పేద ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసారు. ప్రతి కుటుంబానికి 5 కేజీల బియ్యం, 5 కేజీల కూరగాయలు అందజేసారు.ఆకలితో అలమటించే అన్నార్థులకు అండగా నిలిచి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

**ఆదివాసీ సమాజానికి గర్వకారణం**

మారుమూల ప్రాంతం నుండి వచ్చి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది డాక్టరేట్ సాధించడం ఆదివాసీల ఆత్మగౌరవానికి అరుదైన వన్నె తెచ్చింది. ఒక ఆదివాసీ బిడ్డగా పుట్టి, సమాజ సేవలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన ఆయన ప్రయాణం ఎందరికో ఆదర్శం.విద్య,సేవ ద్వారా మాత్రమే సమాజంలో మార్పు తీసుకురాగలమని నమ్మి, అణగారిన వర్గాల అభ్యున్నతికి తోడ్పడుతున్న కృష్ణబాబుకు డాక్టరేట్ రావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆయనను శాలువాతో సత్కరించి అభినందించింది.

## మద్దెలగూడెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**ప్రజాపక్షం/వేలేరు:** స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్ఎ కడియం శ్రీహరి,వరంగల్ ఎంపి కడియం కావ్య సహాయసహకారాలతోనే మద్దెలగూడెం గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని సర్పంచ్ మనోజ్‌కుమార్ అన్నారు,బుధవారం వేలేరు మండలంలోని మద్దెలగూడెం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంబించి మాట్లాడారు.మద్దెలగూడెం గ్రామానికి ఎంఎల్ఎ కడియం రూ,10లక్షలు మంజూరు చేయగా గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంబించడం జరిగిందని రాబోయే రోజులలో ఎంఎల్ఎ కడియం శ్రీహరి,ఎంపి కడియం కావ్య సహాయసహకారాలతో,గ్రామస్తుల అండదండలతోని గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడంకోసం కృషిచేస్తానని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ హనుమకొండ మనోజ్‌కుమార్,ఉపసర్పంచ్ సల్ల స్వరూప,మాజీసర్పంచ్ మిల్‌కూరి అంజమ్మరవిందర్,సమన్వయ కమిటి సభ్యుడు మిల్‌కూరి మధు వార్డు సభ్యులు నీలం వెంకన్న,తాల్లపల్లి యాదగిరి,మిల్‌కూరి యాదమ్మ,కొట్టె సంధ్యారాణి,మద్దూరి రాధ ,గ్రామశాఖ అధ్యక్షుడు పోగుల రాజు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలి..



**ప్రజాపక్షం/నడికూడ:** జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం భాగంగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు కార్యక్రమం నడికూడ మండల పరిధిలోని చర్లపల్లి గ్రామంలో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ బండి రేణుక శంకర్ ముదిరాజ్,ఉప సర్పంచ్ మామిడాల శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వల్ల పశువులకు తీవ్రమైన జ్వరం, నోటిలో పుండ్లు,కాళ్లలో గాయాలు ఏర్పడటంతో పాటు పాడి పశువుల పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని ఈ టీకాలు పూర్తిగా సురక్షితమైనవని,రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలనిసూచించారు.పశువైద్యాధికారి వినయ్ మాట్లాడుతూ మార్చి10 నుండి ఏప్రిల్ 9 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య బృందాలు పర్యటించి నాలుగు నెలల వయస్సు దాటిన గేదెజాతి,గోజాతి పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు.పశువులకు గుర్తింపు కోసం చెవిపోగు వేయించి వివరాలను భారత్ పశుధన్ మొబైల్ దరఖాస్తులో నమోదు చేయించాలని,గాలికుంటు వ్యాధి రహిత రాష్ట్ర నిర్మాణంలో రైతులు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నవత ఎల్ ఎస్ సి,రవీంద్రనాథ్ విఏ,లాల్ సింగ్ ఓ ఎస్,హనుమంతు గోపాలమిత్ర,సాంబశివరావు గోపాలమిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

### తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్



**ప్రజాపక్షం/కాటారం;** వంటగ్యాస్ ధరల పెంపు సామాన్య ప్రజలపై భారం అని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు.బుధవారం మండలకేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడుతూ వంట గ్యాస్ ధరలను చమురు సంస్థలు భారీగా పెంచడం వల్ల ప్రజలపై తీవ్రమైన భారం పడుతుందని అన్నారు.ప్రజా సంఓపమాన్ని విస్మరించి తీసుకుంటున్న నిర్ణయాలు సరైనవి కాదని గతంలో ఉన్న ధరల కంటే విపరీతంగా పెంచడం దారుణమని అన్నారు.ఇజ్రాయిల్,ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వల్ల పెట్రోల్,డిజీల్ ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని అవేదన వ్యక్తం చేసారు.ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు నానా ఇబ్బందుల పడుతున్నారనిప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని చెప్పిన ప్రభుత్వాలు ప్రజలను విస్మరించి పాలిస్తున్నారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే వంట గ్యాస్ ధరలు తగ్గించి ప్రజలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసారు.ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని లేదంటే ప్రజల విశ్వాసం కోల్పోతారని అన్నారు.

## హోంగార్డు వర్ధంతికి దుప్పట్లు పంపిణీ



**ప్రజాపక్షం/పాపన్నపేటః** మండల పరిధి లోని నాగు సాన్ పల్లికి చెందిన మహేందర్ ఏడాది క్రితం గుండెపోటుతో మరణించాడు. బుధవారం ఆయన వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మెదక్ లో హోంగార్డ్ ఉద్యోగం చేస్తూ గత ఏడాది (2025) మార్చి11న గుండెపోటుతో అకాల మరణం చెందాడు. హోంగార్డు తలారి మహేందర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన జ్ఞాపకాలు మాత్రం అందరి వెన్నంటే ఉన్నాయని కుటుంబ సభ్యులు గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు భాగ్యలక్ష్మి, కౌశిక్, స్రుజన్, సిద్దేశ్వర్, రాము, నాయికోటి భాస్కర్, కృష్ణ, రాజు, సురేష్, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** చెట్ల గౌరారం గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శి శ్రీనివాస్ ను సర్పంచ్ చింతకింది దివ్య శ్రీ హరి గౌడ్,పాలకవర్గ సభ్యులతో కలిసి సన్మానించారు.మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం గ్రామపంచాయతీ నూతన కార్యదర్శిగా శ్రీనివాస్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు.గతంలో కార్యదర్శిగా విధులు నిర్వహించిన విజయ్ భాస్కర్ బదిలీ కాగా ఆయన స్థానంలోకి శ్రీనివాస్ వచ్చినట్లు శ్రీహరి గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసయ్య, పాలకవర్గ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పరిశుద్ధమైన నీరు అందించాలి

### జడ్పి సిఇఒ ఎల్లయ్య

**ప్రజాపక్షం/అల్లాదుర్గంః** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా మండలంలోనీ ముస్లాపూర్ గ్రామంలో బుధవారం జడ్పి సీఈవో సిహెచ్ ఎల్లయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంక్ పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండలాధికారులకు ఆదేశించారు. గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధంపై మురికి కాలువలు రోడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ పడిగే జ్యోతి, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పెరటి తోటల పెంపకంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని బచ్చురాజుపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సౌజన్యంతో స్వయం సహాయ గ్రూపులకు (ఎస్‌హెచ్‌జి)సేంద్రియ పద్ధతిలో పెరటి తోటల పెంపకం గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మహిళ తమ ఇంటి పెరటి భాగంలో వారి ఇంటికి సరిపడ తోటకూరలు, కాయగూరలు పండించు కొన్ని తమ ఆరోగ్యముతో పాటు కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పౌష్టికమైన ఆహారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్ శ్రీమతి శైలజ శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో పెరటి తోటల పెంపకం ఎంతగానో ఉపయోగపడిందని, అదే విధంగా ప్రస్తుత కాలంలో రసాయనిక ఎరువులు వాడకం వలన మనిషి ఆరోగ్యం దెబ్బతింటుంది కావున ప్రతి మహిళ పెరటితోటల పెంపకంవైపు మొగ్గు చూపవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, రామాయంపేట మండల ఇంచార్జ్ వ్యవసాయ అధికారి భరత్, రామాయంపేట్ మరియు నిజాంపేట్ వ్యవసాయ విస్తీర్ణాధికారులు, ఐకెపి సిసి అమృత, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రాములు, విఒ మంజుల, స్వయం సహాయక గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

## జన గణన విధులను పక్కాగా నిర్వహించాలి

### అడిషనల్ కలెక్టర్ పాండు




**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జన గణన విధులను పక్కాగా నిర్వహించాలని అప్పుడే ఆయా వర్గాల ప్రజలకు భవిష్యత్తులో కల్పించాల్సిన మౌళిక సదుపాయాలు అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ఒక అవగాహనకు వచ్చి కార్యాచరణను అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుందని అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. సెన్సెస్ 2027 ను పురస్కరించుకుని జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగస్వాములు అయ్యే తహసీల్దార్లకు మున్సిపల్ కమిషనర్లు , ఎంపిడిఒలకు సంబంధిత శాఖల అధికారులకు బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 13 వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుండగా హైదరాబాద్ నుండి వచ్చిన మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పిస్తున్నారు. జనాభా గణన కోసం ఎలా సన్నద్ధం కావాలి, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, తదితర అంశాల గురించి పవర్ పా యింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 2011 లో చివరి సారి జనాభా గణన జరిగిందని తెలిపారు. ప్రస్తుతం సాంకేతికతను వినియోగిస్తూ డిజిటల్ విధానంలో జనాబా లెక్కల సేకరణ జరిపేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుగుణంగా చర్యలు తీసుకోవడం జ రుగుతుందన్నారు. తొలి దశలో నివాస గృహాలతో పాటు అన్ని రకాల కట్టడాలు ,కుటుంబ వివరాలను సేకరించడం జరుగుతుందని ,రెండవ విడతలో వ్యక్తి గత వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. దేశంలోనే తొలి సారిపూర్తి డిజిటల్ విధానం ద్వారా జన గణన జరపాల్సి ఉంటుందన్నారు. సిఎంఎం ఎస్ పోర్టల్‌లో వివరాలు సేకరించాలన్నా రు. జన గణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై వాస్తవ వివరాలు వెల్లడించాలని సూచించారు. ఏ ఒక్కరి వివరాలు సైతం ఎక్కడ కూడా బయటకి వెల్లడి కావని నేరుగాలో నిక్షిప్తం అయ్యేలా సాంకేతికతను వినియోగిస్తున్నారని అన్నారు. ఈ సారి సెల్ఫ్ డిక్లరేషన్ ఎంతో ముఖ్యమని అధికారులు ఎన్యుమరేటర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఛార్జీ లెవల్ అధికారులు ప్రతిరోజు జన గణన ప్రక్రియను సమీక్షించాలని తాము కూడా రోజువారీగా పర్యవేక్షణ జరుపుతామన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో నిర్దేశిత గడువు లోపు జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను మెరుగైన రీతిలో పూర్తి చేసేలా సన్నద్ధం చేయాలన్నారు. ప్రణాళిక రూపకల్పన ,అభివృద్ధి కార్యక్రమాలు , సంక్షేమ పథకాల రూపకల్పనకు దోహదపడే జనగణన ప్రక్రియను నిబద్ధత అంకితభావంతో నిర్వహించాలని ఆయన హితువు పలికారు. ఈ కార్యక్రమంలో నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, సిపిఒ బాలశౌరి , డిప్యూటీ సిఇఒ స్వప్న, ఆర్డీఓలు రాజేందర్,దేవుజా, డిఇఒ వెంకటేశ్వర్లు డిసిఒ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** నేడు మారుతున్న కాలానుగుణంగా రైతులకు ప్రభుత్వం ఆందిస్తున్న సబ్సిడీ వ్యవసాయ పనిముట్లను రైతులు కొనుగోలు చేసుకుని ఆధిక పంటలను దిగుబడులను పొందాలని తెలంగాణ బి సి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. బుధవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో హుస్నాబాద్, కొహెడ, ఆక్కన్నపేట మండలాలకు చెందిన 38 మంది రైతులకుగాను 53లక్షల 80వేల రూపాయల విలువైన వ్యవసాయ పనిమట్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి , వైస్ చైర్మెన్ చిత్తారి పద్మ, ఆత్మక మిటీ చైర్మన్ ఐలయ్య, వ్యవసాయ ఆధికారి స్వరూప, సహకార సంఘం చైర్మన్ బి శివయ్య, కొహెడ మార్కెట్ చైర్మన్, వ్యవసాయ ఆధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమా సింగ్‌ను బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, శాలువతో సన్మానించి, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుహాసిని రెడ్డి, కలెక్టర్ నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్‌ను సు హాసిని రెడ్డి కోరారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో నర్సాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని వారు ఆకాంక్షించారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్‌వారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కోర్టు ప్రాంగణంలో జరుపుకోవడం జరిగింది. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం గివ్ టు గెయిన్ అనే ఇతి వృత్తంతో నిర్వహించబడింది. మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని మహిళా సాధికారతకు సమాజం పునరంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.భవాని చంద్ర, కె.జయంతి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, కృష్ణార్జున్ జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి, శ్రీలేఖ పోక్సోకోర్టు న్యాయమూర్తి, బి. సౌజన్య జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ఆర్ అనిత ప్రధాన జూనియర్ సివిల్ జడ్జీ, కె. ధనలక్ష్మి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జీ, కోర్టు మహిళా సిబ్బంది ,కోర్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** హత్య కేసులో నిందితుడికి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జీ భవాని చంద్ర జీవిత ఖైదు శిక్షను విధించారు. వివరాలోకి వెళితే జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం 295/2021 సెక్షన్ 302,379 ఐపిసి కింద నమోదైన కేసులో నిందితుడు బుడం రాములు, బిచి రాములుకు 2012 సంవత్సరంలో జహీరాబాద్ నివాసితురాలు, లక్ష్మి (మృతురాలు) తో వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. మద్యానికి బానిసైన నిందితుడు తరచూ తన బార్యతో గొడవపడి ఆమెతో కొట్లాడే వాడు ,దీంతో ఆమె తల్లిగారి ఇల్లు జహీరాబాద్ కు వెళ్లి అక్కడే నివసిస్తూ ఉండేది. తన భార్యతో మాట్లాడాలని చెప్పి శివాలయం వద్దకు తీసుకెళ్లి గొడవపడి అనంతరం సమీపంలోని స్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లి ఆమె చున్నీతో మెడకు బిగించి హత్య చేసినట్లు దర్యాప్తులో రుజువైంది. ఈ కేసును విచారించిన సంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జీ నిందితుడిని సెక్షన్ 302 ఐపిసి కింద దోషిగా నిర్ధారించి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 1000లు జరిమాన విదిస్తూ తీర్పు నిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో 1 నెల సాధారణ కారాగార శిక్ష విధించారు.

## నేడు ప్రజా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళకపై అవగాహన కల్పించేందకు జిల్లాలోని మున్సిపల్‌చైర్‌పర్సన్లు ,వైస్ చైర్ పర్సన్లు ,గ్రామ పంచాయతీల సర్పంచులు ,మున్సిపల్ వార్డు కౌన్సిలర్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వివిద శాఖల ద్వారా ఈనెల 6 నుండి నేటి వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించిందని , ఈ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులకు ఈ కార్యక్రమం లక్ష్యాలు అమలు విధానం , ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్, పథకాలపై అవగాహన కల్పించేందుకు ఓరియంటేషన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమం నేడు ఉదయం 10.00 గంటలకు కందిలోని ఎల్‌ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు, గ్రామ పంచాయతీ సర్పంచులు , మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు ఈ కార్యక్రమానికి తప్పని సరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## బాలికపై యువకుడు అత్యాచార యత్నం

### కేసు నమోదు చేసి విచారణ చేస్తున్న పోలీసులు

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మైనర్ బాలికపై ఓ యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక దాగుడుమూతలు ఆడుకునేందుకు బయటకు రాగానే బాలికు మాయమాటలు చెప్పి పక్కన ఉన్న యువకుడు ఆంజనేయులు అమ్మమ్మ వాళ్ల ఇంటికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించగా బాలిక భయంతో పారిపోయి తన తండ్రితో చెప్పగా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు, ప్రస్తుతం యువకుడు ఆంజనేయులు పోలీసుల అదుపులో ఉన్నట్టు తెలిపారు.

## హామీ నిలబెట్టుకున్న వార్డుసభ్యులు



ప్రజాపక్షం/శివ్వంపేట : మండల పరిధిలోని దొంతి గ్రామపంచాయతీ పరిధిలోని పదవ వార్డు సభ్యులు బుద్దుల మమతభిక్షపతి గత గ్రామపంచాయతీ ఎన్నికలలో తమ వార్డులోని గ్రామస్థులకు ఇచ్చిన మామీని కర్తవ్యంగా నిల బెట్టుకోవడం విశేషం. గత పంచాయతీ ఎన్ని కల్లో తాము పోటీ చేసిన వార్డులో ఎవరు చని పోయినా రూ. 3వేలు ఆర్థికసాయం అందజే స్తానని హామీ ఇచ్చిన విషయం అందరికి తెలి సిందే. తమపై నమ్మకంతో గెలిపించిన పదవ వార్డు ప్రజలకు వార్డుసభ్యులు మమతభిక్షపతి ఇచ్చిన మామీ ప్రకారం మృతిచెందిన సోమ గారి బాలమ్మ కుటుంబానికి రూ. 3వేలు, బీఆ ర్ఎస్ గ్రామకమిటి అధ్యక్షులు చిగుళ్లపల్లి శ్రీని వాస్‌గుప్తా రూ. 3వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాబుసుశీల, వార్డుస భ్యులు కృష్ణ, ఉప్పరి శ్రీనివాస్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య



ప్రజాపక్షం/పాపన్నపేట: ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...గ్రామానికి చెందిన ధారబోయిన కృష్ణ, మాధవి(23) లకు ఒక కుమారుడు ఉన్నారు. కృష్ణ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.గత కొన్ని రోజు లుగా మాధవి ఆరోగ్యం సరిగా ఉండటం లేదు.ఇంటి ఆర్థిక పరిస్థితి సైతం సరిగా లేకపో వడంతో ఈ క్రమంలో మనస్తాపం చెందిన మాధవి మంగళవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కుంది.కాసేపటికి గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

ప్రజాపక్షం/లింగాలఘణపురం: పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని, నెల్లుట్ల గ్రామ సర్పంచ్ నర్సింగ రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని నెల్లుట్ల గ్రామంలో, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99వ రోజుల ప్రణాళిక లో భాగంగా, లింగాలఘణపురం వెళ్లే రోడ్లో గత కొన్ని సంవత్సరాలుగా పేరుకు పోయిన చెత్తను, జెసిబి సహాయంతో, చెత్తను తొలగించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ దామెర కావ్య , గ్రామ శాఖ అధ్య క్షులు, బత్తిని అశోక్ కుమార్ గౌడ్, వార్డ్ మెంబర్లు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



ప్రజాపక్షం/ సంగారెడ్డి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12వ తేదిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్య క్రమంపై హైదరాబాదు నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు ,మున్సిపల్ కౌన్సిలర్లు ,మున్సిపల్ చైర్మన్లకు ఈ నెల 12 వతేదిన నిర్వహించ నున్న శిక్షణ కార్యక్రమం ద్వారా పాలనపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించబడుతుందని తెలిపారు. శిక్షణ కార్యక్ర మాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రజాపా లన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచర ణకు ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేయబడిందని దాని ప్రకారం జూన్ 12వ తేది వరకు చేపట్టనున్న కార్యక్రమా లను విజయవంతంగా అమలు చేయడానికి అన్ని జిల్లాల అధికారి యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని సిఎస్ తెలిపారు. ప్రజా ప్రతినిదులు , ప్రభుత్వ అధికారులు సమ న్వయంతో పని చేస్తే ప్రజలకు మెరుగైన ఫలితాలు అందు తాయని ఆయన స్పష్టం చేశారు.శిక్షణ కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలు ,అలాగే సర్పంచులకు 2018 పంచాయతీ రాజ్ చట్టంపై మున్సిపల్ కౌన్సిలర్లు ,చైర్మన్లకు 2019 మున్సిపల్ చట్టంపై అదే విధంగా వారి విధులు , బాధ్యత లపై పూర్తి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఈ నెల 12వతేదిన ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో లో జిల్లా నుండి అడిషనల్ కలెక్టర్ పాండు ,జడ్పీ సీఈఓ జానకి రెడ్డి ,సీపీఓ బాలశౌరి తదిత రులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రజాపక్షం/సిద్దిపేట : రైతులకు సాగునీరు చివరి ఆయా కట్ట వరకు అందించాలని మాజీ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.సిద్దిపేట నియోజకవర్గంలో కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్ నుండి నగునూర్ మండలానికి వెళ్ళే కుడి కాల్వలో తుంగ,పూడికతో పేరుక పోయి రైతులకు నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని ఎంఎల్ఏ దృష్టికి రావడంతో బుధవారం హైదరాబాద్ నుండి ఇరిగేషన్ ఎస్ఈ సుధాకిరణ్‌తో ఫోన్‌లో మాట్లా డారు.ఈ సందర్భంగా నంగునూర్ మండలంకు వెళ్ళే ప్రధాన కుడి కాల్వలో తుంగ పేరుక పోయింది మెయిందని తొలగించాలని మీ దృష్టికి తెచ్చామని ఆయిన తొలగించక పోవడంతో సకాలంలో చెరువుల్లోకి నీరు అందకపోగా పంట పొలాలకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు.ముఖ్యంగా మిట్టపెల్లి వద్ద కాల్వ లోతుగా ఉండటం వలన ఇటాచ్ జేసిబిలతో కాకుండా లాంగ్ భూం మిషన్‌ను ఏర్పాటు చేసి కాల్వలో తుంగను పూడికను తొలగించాలని తెలిపారు.రైతులకు చివరి ఆయా కట్ట వరకు నీరు అందించేలా చూడాలని అన్నారు.

# గడువు ముగిసిన పదార్థాలు విక్రయిస్తే చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య

ప్రజాపక్షం/రామాయంపేట : హోటల్లలో పాడైన లేదా గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందిస్తే కఠినమైన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు నిర్వాహకులను హెచ్చరిం చారు. ప్రజాపాలన ప్రగతి నివేదికలో బాగంగా 6వ రోజు బుదవారం మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌తో కలసి హోట ళ్లలో తనిఖీలు చేపట్టారు. పట్టణంలో ప్రజలకు పరిశుభ్ర మైన, ఆరోగ్యకరమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టేం దుకు తనిఖీలు చేపడుతున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. పరి శుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, వంటగదితో పాటు స్టోరేరూంలను పరిశీలించారు. ఈసందర్భంగా హోటల్ నిర్వాహకులకు అధికారులు, పాలకవర్గం పలు సూచనలు చేశారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తరుచుగా తనిఖీలు కొనసాగుతాయని, యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కొన్ని హోటల్లలో పరిశుభ్రత లేకుండా పాడైన వస్తువులు కనిపిం చడంతో వారిని హెచ్చరించి మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఉపేక్షించేదిలేదన్నారు. ఈకార్యక్రమంలో మున్సి పల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, దేవుని రంజిత్, దాకి శ్యామలస్వామి, రవి, ప్రవీన్, మద్దెల మాదవి రమేష్, శంకర్‌గౌడ్, బైరం స్వప్నతో పాటు మున్సిపల్ మేనేజర్ రఘువరణ్, ఆర్పీలు పాల్గొన్నారు.

# ''విద్యతో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి''

ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ రెడ్డి



ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట : విద్యార్థులు గొప్ప లక్ష్యంతో క్రమశి క్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, పదో తరగతి ఫలి తాల్లో రాష్ట్రంలో ధూళ్మిట్టను తొలి స్థానంలో నిలపాలి, ధూళ్మిట్ట జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు అనుముల కరుణాకర్ రెడ్డి అన్నారు. ధూళ్మిట్ట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆహ్లాదంగా పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థుల సంబరాలు నిర్వహించారు. అనంతరం ఉపా ధ్యాయులు మాట్లాడుతూ... విద్యార్థులు గొప్ప లక్ష్యంతో చదివి 10/10 సాధించి, ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే ధూళ్మిట్టను ప్రథమస్థానంలో నిలుపా లని సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగా లని, తల్లిదండ్రులతో పాటుగా ఉపాధ్యాయులకు, పాఠశా లకు మంచి పేరును తీసుక రావాలని కోరారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ప్రాధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/కొమురవెల్లి: రైతులు ఉత్పత్తి చేసిన మొక్కజొన్న పంటను నేరుగా మార్కెట్‌కు అనుసంధానం చేయడం ద్వారా అధిక ధరలు పొందవచ్చని ఏడిఏ రాధిక అన్నారు.బుధవారం మండల పరిధిలోని గురువన్నపేట గ్రామంలో వ్యవసాయ సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో మార్కెటింగ్ ఆధారిత వ్యవ సాయ విస్తరణలో భాగంగా మొక్కజొన్న పంటపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మొక్కజొన్న పంటను మార్కెట్‌కు అను సంధానం చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని అన్నారు.సంవత్సరానికి 3 పంటలు పండించవచ్చని కంపెనీ నేరుగా రైతులకు మొక్కజొన్న విత్తనాన్ని అందించి పంట కోత ఖర్చు లేకుండా టన్నుకు 15 వందల నుండి 2 వేల వరకు చె ల్లించడం జరుగుతుందని తెలియజేశారు.ఎకరాకి 2530 టన్నుల దిగుబడి వస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స ర్పంచ్ బుడిగె జహంగీర్ గౌడ్,ఆత్మకమిటీ చైర్మెన్ తిరు పతి,కంపెనీ ప్రతినిధి సతీష్ కుమార్,ఏఈవో రవళి,ఎఫ్‌పి వో,సిఈవో ఝాన్సీ,డైరెక్టర్లు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు సైద్దాంతిక శిక్షణ అవసరం

ప్రజాపక్షం/పాలకుర్తి: కార్యకర్తలకు సైద్దాంతిక శిక్షణ అవ సరం ఉందని బిజెపి నాయకులు నవీన్‌రెడ్డి, దొంగరి మహేం దర్, సృజన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని బీజేపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలకు సైద్దాంతిక శిక్షణ ఇచ్చి ప్రతి ఒక్కరికి బీజేపి ఆశయాలు, క్రమశిక్షణ గురించి అవ గాహన కల్పించి ప్రజాక్షేత్రంలో బీజేపి శ్రేణులు అనుసరించా ల్సిన విధానంపై రాబోయే ఎన్నికలలో బీజేపి విజయం కోసం వ్యూహ రచన ఈ శిక్షణ తరగతుల ద్వారా బోధించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షుడు రవి కుమార్, నాయకులు సంపత్, నిరంజన్, సోమేశ్వర్, దేవ రాజు, శ్రీనివాస్, రవి, సునీల్, కృపాకర్, రవీందర్, భాస్కర్, ప్రవీణ్, కనకరాజు, సోమాజీ, ప్రశాంత్, సైదులు, యాకయ్య, శ్రీనివాస్, వెంకన్న, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా వీడ్కోలు




ప్రజాపక్షం/కొడిపల్లి : మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా కొడిపల్లి గ్రామ సర్పంచ్ మండల సర్పంచుల ఫోరం మం డల అధ్యక్షుడు జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్, జిల్లా యువ కాంగ్రెస్ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా, ఉప సర్పంచ్ శ్వేత మల్లికార్జున్ గౌడ్, ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా యువనేత కౌడ శ్రీనివాస్ గుప్తా తన సొంత నిధులతో విద్యార్థులకు ఎగ్జామ్ మెటీరియల్ అందజే శారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత దేవి ఉపా ధ్యాయ బృందం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్, యువ నాయకులు, కౌడ శ్రీనివాస్ గుప్తా ఉపసర్పంచ్ శ్వేత మల్లికార్జున గౌడ్, ఘనంగా శాలువాలతో సత్కరించారు ఈ సందర్భంగా మండల సర్పం చుల ఫోరం అధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజ్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు తిరుమలేష్, వార్డు సభ్యులు దేవేందర్, నందిని ట్రేడర్స్ ప్రొప్రైటర్ యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు రాగుల భూమయ్య పటేల్, మండల యూత్ నాయకులు కురుమ లక్ష్మణ్ యువ నాయకులు వెంకటేష్ గుప్తా, ఉపా ధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మండలం మారుపాక రైతువేదిక రైతు వేదికలో ATMA (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో భూసార ఫలితాల ఆధారంగా రసాయన ఎరువుల వినియోగం, ఆయిల్ ఫామ్, ప్రకృతి వ్యవసాయం, కూరగాయల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్ , మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ స్థానిక, ఏఈఓ రాజు ప్రజాప్రతినిధులు గ్రామ సర్పంచ్ దొబ్బల మల్లేశం, క్లస్టర్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జనగణన పకడ్బందీగా పూర్తి చేయాలి



### ప్రతి ప్రభుత్వ పథకానికి ఈ గణన కీలకం

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జనగణన 2027 ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027పై సెన్సస్ ఫర్ వెల్ఫేర్ పేరిట ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జీ ఆఫీసర్లుకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ హాజరై మాట్లాడారు. సెన్సస్ చట్టం 1948 రాజ్యాంగ ప్రకారం ప్రభుత్వం జన గణన చేపడుతుందని తెలిపారు. చార్జ్ ఆఫీసర్లుగా మున్సిపాలిటీలో కమిషనర్లు, మండలాల్లో తహసీల్దార్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లుగా ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉంటారని వెల్లడించారు. ఎన్యూమరేషన్ బ్లాక్ లో దాదాపు 700 నుంచి 800 మంది ప్రజలు ఉంటారని తెలిపారు. ఎన్యూమరేటర్, సూపర్ వైజర్లుగా ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక టెక్నికల్ సహాయకులు ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొట్ట మొదటి స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అని వివరించారు. ఈ విధానంలో ప్రజలే తమ వివరాలు పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన గణన అధికారిగా కలెక్టర్, జిల్లా అదనపు గణన అధికారిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గణన అధికారిగా శ్రీనివాసాచారి ఉంటారని తెలిపారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. దీంతో ప్రతి ప్రభుత్వ పనికి సంబంధించి ఈ వివరాలు కీలకమని స్పష్టం చేశారు. జనగణనలో పాల్గొని అధికారులు బాధ్యతాయుతంగా తమ కేటాయించిన విధులను నిర్వర్తించాలని, వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. రోజువారి ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్ నుంచి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్ శ్రేయ, సుమిత్ర హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్పుద్దిన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్పీజీ, యూరియా సమస్యలను కేంద్రం వెంటనే పరిష్కరించాలి

### పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్, యూరియా సరఫరా సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో గత సంవత్సరం యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మిస్మేనేజ్మెంట్ చేయడం వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఇప్పుడు కూడా అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఎల్పీజీ, ఎల్ఎన్జీ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దాని ప్రభావం యూరియా సరఫరాపై కూడా పడే ప్రమాదం ఉందని, విదేశాంగ విధానంలో స్పష్టమైన దారి లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. విదేశాంగ మంత్రి డా.ఎస్. జైశంకర్ మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తగిన విధంగా చర్యలు తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా యూరియా కొరత మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా స్పందించాలని డిమాండ్ చేశారు.

## ఆసుపత్రిలో క్యాంటీన్ ప్రారంభం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంద్ర మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం ప్రారంభించారు. ఆస్పత్రిలోని రోగులకు, వారి బంధువులకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించేందుకు ఈ క్యాంటిన్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాల ద్వారా నిర్వహించే ఈ క్యాంటిన్ వల్ల వారి ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడ్తుందన్నారు. క్యాంటిన్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. బుధవారం సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎస్పీ పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనియల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, నాకబంది, పికెట్స్, వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్ మరియు క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు శారీరక దారుఢ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇందుకు మోబిలైజేషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఫైరింగ్ శిక్షణను పరిశీలించి ఫైరింగ్‌లో పాల్గొన్నారు. ఫైరింగ్, రాత పరీక్షలు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్ మెమొంటోలను అందజేశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎస్సై



**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండల కేంద్రంలోని హిమ్మత్‌నగర్ క్రాస్ వద్ద సర్పంచ్ జడల శ్రీకాంత్, ఉపసర్పంచ్ మ్యాక శ్రీనివాస్, పాలకవర్గం వెంకన్న, రమేష్, రవీందర్, స్వప్న, నవ్య, రమ, వినోదల ఆద్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ ఆవుల తిరుపతి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వేసవిలో మంచినీళ్లు ప్రజలకు, బాటసారులకు ఎంతో ఉపయోగపడతాయని, చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నల్ల మమతా తిరుపతిరెడ్డి, నాయకులు లకోట వెంకన్న, సదాశివరెడ్డి, రమేష్, సంపత్, శ్రీనివాస్, కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎద్దుగుట్ట మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డ్ ఎద్దు గుట్ట మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవంను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మల్లన్న స్వామి కృపతో ప్రజలందరు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో సంతోషకరమైన జీవితం గడపాలని పాడిపంటలు వ్యాపార అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కళ్యాణానికి కౌన్సిలర్ సభ్యులు లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, దొంతినేని కళ్యాణి అశోక్ రావు, దార్నం అరుణ లక్ష్మీ నారాయణ, ఎలుక వెంకటేశం, జిందం చక్రపాణి, మంచే శ్రీనివాస్,గుండ్లపల్లి పూర్ణచందర్, భూక్య రెడ్డి నాయక్, జెల్ల కిషన్, దిడ్డి శ్రీనివాస్, దొంతినేని అశోక్ రావు, దేవయ్య, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య



### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/గొల్లపల్లి/జగిత్యాల రూరల్ :** చదువు మించిన ఆస్తి లేదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్ల కోట గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్స్ ను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన మంత్రి అడ్లూరికి పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో చదువును మించిన ఆస్తి లేదని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అనేక మంది గొప్ప వ్యక్తులు అయ్యారని ముఖ్యమంత్రి విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పాఠశాలల్లో పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

**మెగా ఎడ్యుకేషన్ ఫేర్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి**

జగిత్యాల పట్టణంలో తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో మార్చి 15 వ తేదీ ఆదివారం రోజున కరీంనగర్ పట్టణంలోని టి.ఎన్.జి.ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మెగా ఎడ్యుకేషన్ ఫేర్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే డా.ఎం.సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ చేతుల మీదుగా బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్య అవకాశాలపై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించేందుకు మెగా ఎడ్యుకేషన్ ఫేర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి చైర్మన్ తారక్ గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముసిపట్ల రాజేందర్, ముసిపట్ల దేవేందర్, కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రాజ్, రవీందర్, తెలంగాణ విద్యా సమితి నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

